మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పొడిగింపు

పూడూరు, ఫిబ్రవరి 27: మండలంలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు మార్చి 2వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో 100 ఖాళీలు, 7-10 వ తరగతి వరకు అందుబాటులో ఉన్న ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తెలంగాణ.సీజీజీ.జీవోవీ. ఇన్‌వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



చేవెళ్ల సభకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు, నాయకులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతీ ఎకరానికీ నీరందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం చేవెళ్లలో నిర్వహించిన జనజాతర సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు ప్రతీ గ్యారంటీ పథకాన్ని అమలు చేస్తామని, అర్హులందరికీ పథకాలు అందేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేలా కృషిచేయాలని కార్యకర్తలను కోరారు. ఈ సభలో డిప్యుటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు మాట్లాడారు.

- కార్యకర్తలెవరూ ధైర్యాన్ని కోల్పోవద్దు
- పార్లమెంట్ ఎన్నికల తరువాత అందరికీ న్యాయం చేస్తాం
- ప్రతీ ఇంటికి వెళ్లి గ్యారంటీలు అందరికీ చేరేలా చూడండి
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి
- బీజేపీ అభ్యర్థి మంచోడే... కానీ ఆ పార్టీనే సక్కగ లేదు
- చేవెళ్ల జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



చేవెళ్ల జన జాతర సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది

ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ప్రతీ ఎకరానికి నీరందిస్తాం



రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల/మొయినాబాద్/మొయినాబాద్ రూరల్/ శంకర్‌పల్లి, ఫిబ్రవరి 27 : ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును విస్మరించిందన్నారు. అయితే ఇపుడు తమ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేసి ప్రతీ ఎకరానికి నీరందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. 'వికారాబాద్ జిల్లా నుంచి ఎన్నికైన నాకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చారు. జిల్లాలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి ఉన్నారు.' అని తెలిపారు. భవిష్యత్‌లో ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో పాటు మహేందర్‌రెడ్డి, సునీతమ్మ మీకు అండగా ఉంటారని చెప్పారు. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత మాదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించినప్పుడే మాకు నిజమైన గెలుపు అవుతుందన్నారు. కార్యకర్తలు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని, ప్రతి ఇంటికి వెళ్లి, ప్రతి తలుపు తట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరు గ్యారంటీలు అందరికీ చేరేలా చూడాలన్నారు. పథకాలు ఎవరికి రాకపోయినా వారి పేర్లు రాసుకుని వారికి ఇప్పించేలా చూడాలని తెలిపారు. వాళ్లే మనల్ని కష్టపడి గెలిపిస్తారని చెప్పారు. ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకువెళ్లేందుకు మీరు సిద్ధమేనా? సిద్ధం అనేటోళ్లు చేతులు ఎత్తండి అని సీఎం పేర్కొన్నారు. పార్టీ నిర్ణయించిన చేవెళ్ల ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నుంచి బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డిపై పరోక్షంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇక్కడ బీజేపీ నుంచి ఓ నాయకుడు పోటీ చేస్తున్నాడు. పాపం ఆయన మంచోడే. కానీ ఆయన పార్టీనే సక్కగ లేదు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసినా దండగే అవుతుంది.' అని ఎద్దేవా చేశారు. ఏదో జరుగుతుందని బీజేపీలోకి వెళితే ఇక్కడ ఏమీ లేదని, గతంలో ఆ నాయకుడే ఈ విషయం చెప్పాడన్నారు. కవితను జైలుకు పంపిస్తారనుకుంటే పంపలేదని స్వయంగా ఆ నాయకుడే చెప్పినట్లు ఆయన చెప్పారు.

ప్రాణహిత-చేవెళ్ల నీరు రాకుండా చేసిందే కేసీఆర్: భట్టి

చేవెళ్ల నుంచి మాట ఇస్తున్నాం. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదాన్నీ వదిలిపెట్టం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ జన జాతర సభలో ఆయన ప్రసంగించారు. బీఆర్ఎస్‌కు చెంపపెట్టులాగా గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాల గ్యారంటీల అమలుతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దశాదిశా నిర్దేశం చేసిందన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రం. ఇందిరమ్మ రాజ్యం. కుల మతాలను చీల్చి ఓట్లు పొందటం సాధ్యం కాదన్న విషయాన్ని బీజేపీ గ్రహించాలన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా చేవెళ్లకు గోదావరి నీటిని తీసుకువచ్చేలా గత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన డాక్టర్ అంబేడ్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును అడ్డుకున్నది కేసీఆరే అన్నారు. తుమ్మిడిహట్టి వద్ద కట్టాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును దిగువకు తెచ్చి ఎత్తు తగ్గించి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మించి చేవెళ్లకు నీరు రాకుండా చేసింది గత సీఎం కేసీఆర్ అని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి చేవెళ్లకు కృష్ణా నీటిని తరలిస్తామన్న కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ వద్ద తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. బీఆర్ఎస్ పాలకులు చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక నానా తంటాలు పడుతున్నామన్నారు. ప్రభుత్వం ఆదాయం వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఒకటో తేదీనే జీతాలిచ్చే స్థితికి ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చామన్నారు. డ్వాక్రా మహిళలకు త్వరలోనే వడ్డీలేని రుణాలు ఇవ్వాలని క్యాబినెట్‌లో నిర్ణయించామని చెప్పారు. ఈ పథకం కింద మహిళలకు రూ.వేల కోట్లు ఇవ్వాల్సి వచ్చినా వెనకాడేది లేదన్నారు. గత తొమ్మిదేళ్లగా ఈ పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం తుంగలో తొక్కి, మహిళలను ఆర్థిక సాధికారత లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన మహిళా కార్మికులందరికీ ప్రతి నెలా చెల్లింపులు చేస్తున్నామన్నారు. గ్యారంటీ స్కీమ్‌లను అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ వర్తింపజేస్తామన్నారు. పేద, మధ్య తరగి బలహీన వర్గాలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం పొందటానికి రాజీవ్ ఆరోగ్య శ్రీని రూ.10లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రారంభించిన ఉచిత బస్సు రవాణ ద్వారా రాష్ట్రంలో 18కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు లబ్ధిపొందినట్లు, ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు దీవించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.



చేవెళ్ల సభలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

దోపిడీ రాష్ట్రంగా తయారు చేసిన కేసీఆర్ : ఎమ్మెల్యే మల్‌రెడ్డి

పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను దోపిడీ రాష్ట్రంగా తయారు చేశారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా, తోడుగా ఉంటుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో 17సీట్లకు 14 సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు నడుం బిగించాలన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి తీసుకెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించే సమయం ఆసన్నమైందని తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం హామీలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలు వెంటనే అమలు చేసిందని, మరో రెండు గ్యారంటీలను నేడు అమలుకు సీఎం శ్రీకారం చుట్టారని, నాడు ఇందిరమ్మ పేదలకు ఇళ్లు ఇచ్చిందని నేడు సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

చేవెళ్లకు రూ.100కోట్లు ఇవ్వాలి: భీం భరత్

చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీం భరత్ కోరారు. బీఆర్ఎస్ అధికారంలో

మిగతా 7వ పేజీలో...

పది పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 27: జిల్లా లో జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సజావుగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిండెంట్లు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం సమావేశం హాల్‌లో విద్యాశాఖ అధ్వర్యంలో చీఫ్ సుపరిండెంటెండ్‌లు, మండల విద్యాధికారులకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదోతరగతి పరీక్షలు మార్చి 28 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉంటాయని, ఎక్కడ కూడా చిన్న సమస్య రాకుండా చూడాలని, పరీక్షలకు సంబంధం లేని వ్యక్తులు ఎవరిని కూడా పరీక్ష హాల్‌లోకి అనుమతించొద్దన్నారు. పరీక్షా కేంద్రాలలో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఈవో రేణుకాదేవి, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరిగే పెండింగ్ పనులను వారం లోపు పూర్తి చేయాలనీ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేబర్‌ను మోబిలైజ్ చేయడం, ఉపాధి కల్పించడం, గ్రామాల్లో అత్యవసర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

లక్ష్యాలను అధిగమించాలి

కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి27: 2024సంవత్సరానికి గానూ హరితహారంలో లక్ష్యాలను అధిగమించేలా పని చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో హరితహారం ప్రణాళికపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా హరితహారంలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధం కావాలన్నారు. శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామాలల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి, అవసరమైన స్థలంలో మొక్కలు నాటాలన్నారు. హరితనిధిలో ఎన్ని మొక్కలు ఉన్నాయని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో జానకిరామ్, పరిశ్రమలశాఖ అధికారి సాంబశివరావు, ఉద్యానవన శాఖ అధికారి నీరజాగాంధీ, మున్సిపల్ అధికారులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా విలేజ్‌లు!

- వికారాబాద్ జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్
- లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రణాళిక
- కొడంగల్‌లో మూడువేల ఎకరాల గుర్తింపు



వికారాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ జిల్లాను గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్‌గా అభివృద్ధి పరచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ పరిధిలో పార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా చర్యలు తీసుకోనున్నారు. విద్య, వైద్య సేవలతో పాటు ఉపాధి అవకాశాలు పెంపొందించే విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాను పారిశ్రామిక పరంగానూ అభివృద్ధి పరిచే విధంగా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం వికారాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాలను ఎంపిక చేసింది. ఒక్కో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ పరిధిలో మూడు నుంచి నాలుగు ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఫార్మా విలేజ్‌ల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా రాయితీలు ఇవ్వనున్నారు. పారిశ్రామికవేత్తలకు అపారమైన అవకాశాలు కల్పించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ పరిధిలో అభివృద్ధి పరిచే ఫార్మా విలేజ్‌ల ద్వారా లక్ష నుంచి లక్షన్నర మందికి కొత్త ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది.

అత్యంత సమీపంలో ...

రాష్ట్ర రాజధానికి, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండడం వికారాబాద్ జిల్లాకు కలిసి వచ్చింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వికారాబాద్ 70 కిలోమీటర్ల దూరం ఉంది. విమానాశ్రయం నుంచి వికారాబాద్ జిల్లా చేరుకునేందుకు గంటన్నర సమయం పట్టనుంది. విమానాశ్రయానికి అత్యంత సమీపంలో గ్రీన్ ఫీల్డ్ క్లస్టర్ ఏర్పాటు చేయడం వల్ల ఇతర దేశాల్లోని పారిశ్రామిక వేత్తలు ఆకర్షితులై ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహదారులకు అతి సమీపంలోనే ఈ ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో గ్రీన్ ఫీల్డ్ క్లస్టర్ ఎక్కడ ఏర్పాటు చేయనున్నారనేది స్పష్టత రావాల్సి ఉంది. పారిశ్రామిక పరంగా అభివృద్ధి పరిచేందుకు ఇప్పటికే కొడంగల్ నియోజకవర్గం పరిధిలో మూడు వేల ఎకరాల వరకు గుర్తించినట్లు తెలిసింది. పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. గ్రీన్ ఫీల్డ్ క్లస్టర్ ఏర్పాటుకు వికారాబాద్ జిల్లాను ఎంపిక చేయడం వల్ల రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండనున్నాయి.

విజయీభవ!

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



వికారాబాద్‌లోని కళాశాలలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా కొనసాగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. ఇంటర్ పరీక్షలకు వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 16,823 మంది విద్యార్థులు రాయనుండగా, వారిలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 7,799 మంది విద్యార్థులు, సెకెండియర్ పరీక్షలకు 9,024 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు. అదే ప్రైవేట్ కళాశాలల్లోనైతే చీఫ్ సూపరింటెండెంట్‌కు సహాయంగా అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లను నియామకం చేశారు. పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం కల్పించకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్, డెక్ బృందాలను ఏర్పాటు చేశారు. కాగా, ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించేందుకు బోర్డు బృందాలు కూడా పరీక్షా కేంద్రాలను సందర్శించనున్నాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోనున్నారు. పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు చేపట్టనున్నారు.

చీర్యాల్‌లో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ

కీసర, ఫిబ్రవరి27: చీర్యాల్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గంగా భ్రమరాంబికా సమేత శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే మహోత్సవంలో భాగంగా మంగళవారం రెండవ రోజు ఉదయం గవ్యాంత పూజలు, వాస్తు పూజ, పర్యగ్నికరణం, జలాధివాసం, ప్రధాన దేవతాహోమాలు, నీరాజన తీర్థ ప్రసాదాములు, మండపార్చన, అవాహిత దేవతా హోమాలు, వాస్తుహోమం, రుద్రార్చన నీరాజన మంత్రపుష్పాలతో పాటు అన్నదాన వితరణ కార్యక్రమం ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే చామాకూర మల్లారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, హరిగౌడ్, ఎంపీపీ మల్లారపు ఇందిర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ

వికారాబాద్, ఫిబ్రవరి 27: గ్రామీణ మహిళలకు కాస్ట్యూమ్స్, ఇమిటేషన్, వన్ గ్రామ్ జ్యువెలరీ తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, స్వర్ణభారత్ ట్రస్ట్(ముచ్చింతల్) సంయుక్తంగా ఫిబ్రవరి 28 నుంచి 13 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల మహిళలు 19 నుంచి 45 సంవత్సరాల వయసు లోపు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్ వసతి, భోజన సౌకర్యం, యూనీఫాంతో పాటు టూల్‌కిట్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జ్యూవెలరీ శిక్షణకు దరఖాస్తు చేసుకునే మహిళలు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ డైరెక్టర్ జీవీఎఆర్.కృష్ణను సంప్రదించవచ్చని తెలిపారు. వివరాలకు 93914877, 9177141712, 6301890681 లేదా 9618534720 నెంబర్లకు డయల్ చేయవచ్చని సూచించారు.

పల్స్‌పోలియోపై శిక్షణ



మాట్లాడుతున్న హెచ్ఈవో వేంకటేశ్వర్లు

ధారూరు, ఫిబ్రవరి 27: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై ధారూరులో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశావర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు, సూపర్‌వైజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో హెచ్ఈవో వెంకటేశ్వర్లు, హెచ్ఈ రేణుకుమార్‌లు మాట్లాడుతూ మార్చి 3వ తేదిన 5సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. 4, 5తేదీల్లో ఇంటింటికీ తిరిగి కార్యక్రమానికి విజయవంతం చేయాలన్నారు. ధారూరు పీహెచ్‌సీ పరిధిలోని 2,495, నాగసమందర్ పీహెచ్‌సీ పరిధిలో 2,930మంది 0-5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నారని తెలిపారు. వీరి కోసం 42 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామాల్లో దండోరా, బైక్ ర్యాలీలు, మైకుల ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు తమవంతు సాయం అందిస్తామని తహసీల్దార్ సాజీదా బేగం, ఎంపీడీవో బి.నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో పీహెచ్ఎఫ్ ఫాతిమా, సూపర్‌వైజర్ ఉమ, హెల్త్ అసిస్టెంట్ సురేందర్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇచ్చాకే పథకాలు అమలు చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 27: అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మండల పరిషత్‌లోని ఎంపీపీ చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ముందుగా రాష్ట్రంలో అర్హులైన 30లక్షల కుటుంబాలకు తెల్లరేషన్‌కార్డులు ఇచ్చిన తర్వాతే సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పేరుతో పేదవారి నడ్డివిరుస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. రేషన్ కార్డులు పంపిణీ చేసినందుకు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ నాయకులు ఎల్ఆర్ఎస్ రద్దు చేస్తామని, ఇప్పుడు ఎల్ఆర్ఎస్ ఎలా వసూలు చేస్తారని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్ళకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందోబస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది

(ఐదో పేజీ తరువాయి)

ఉన్న పదేళ్లలో చేవెళ్ల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజిక వర్గంలో సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. చేవెళ్ల గడ్డ అంటేనే కాంగ్రెస్ అడ్డా అన్నారు. నాడు వైఎస్సార్ పాదయాత్ర చేవెళ్ల నుంచి చేపట్టారని, నేడు రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు చేవెళ్ల నుంచి ఎస్సీ డిక్లరేషన్ బహిరంగ చేపట్టి విజయవంతమయ్యారని తెలిపారు.

కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కేసీఆర్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. రంగారెడ్డి జిల్లా రైలు ఇంజన్ లాంటిదని.. మిగతా జిల్లాలు భోగీల లాంటివన్నారు. పాలమూరు-రంగారెడ్డి రాకుండా చేశారని, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డును పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సీఎం రేవంత్‌రెడ్డి పూడూరులో నేవీ రాడార్ ఏర్పాటుకు రూ.2,500కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

కేసీఆర్ రూ.7లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని అప్పగించారు: షబ్బీర్ అలీ

రూ.10వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పుతో కేసీఆర్ అప్పగించారని పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ అన్నారు. 139 సంవత్సరాల చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. చేవెళ్ల కాంగ్రెస్‌కు సెంటిమెంటన్నారు. ఏ కార్యక్రమాన్ని ఇక్కడ నుంచి చేపట్టినా అన్ని వియవంతమైనట్లు చెప్పారు.

కవిత లిక్కర్ కేసులో జైలుకు పోవడం ఖాయం: పుష్పలీల

లిక్కర్ కేసులో కవిత జైలుకు పోవడం ఖాయమని మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. కవితను జైలుకు పంపించేంత వరకు వదిలే ప్రసక్తి లేదన్నారు. కూతురుతో పాటు కేసీఆర్‌ను కూడ వదిలిపెట్టమన్నారు. అవినీతికి పాల్పడిన సొమ్మును కక్కిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 15 ఎంపీ సీట్లను గెలుస్తామని ఆమె తెలిపారు.

బీజేపీ, బీఆర్ఆర్‌కు కనువిప్పు కలిగేలా గ్యారంటీలు: ఆది శ్రీనివాస్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు కనువిప్పుల కలిగేలా ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు విడతల వారీగా శ్రీకారం చుడుతోందని ఆయన పేర్కొన్నారు.

ఎన్నో అవమానాలను భరించాను: సునీతామహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో ఉండి ఎన్నో అవమానాలను భరించానని, మనో వేదనకు గురైనట్లు వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమాలకు ఆకర్శితురాలినై తాను ఇటీవలే కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు.

ఆరు గ్యారంటీలు అద్భుతం: తీగల అనితాహరినాథ్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీమ్‌లు అద్భుతంగా ఉన్నాయని రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మహిళా సాధికారతకు ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగపడుతుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ పేదల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు.

పేదల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: చల్లా నర్సింహారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల ఎంపీగా పోటీ చేసేందుకు ఇతర పార్టీల నేతలు వెనుకంజ వేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారీటీతో గెలిపించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్..

చేవెళ్లలో జనజాతర పేరుతో కాంగ్రెస్ పార్టీ మంగళవారం నిర్వహించిన బహిరంగ సభ సక్సెస్ అయ్యింది. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జిల్లాలో మొదటి సారిగా నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. రాత్రికి రాత్రే ఎన్నికల కోడ్ వెలువడటంతో అధికారులు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. అయినప్పటికీ ఏమాత్రం తగ్గకుండా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అనుకున్న స్థాయిలో జనాలను తరలించడడంలో సఫలీకృతమయ్యారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆరు గ్యారంటీలు చేవెళ్ల బహిరంగ సభలో ప్రారంభించాల్సి ఉండగా సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమక్షంలో ప్రారంభించారు. అనంతరం ఆయన చేవెళ్ల సభకు రోడ్డు మార్గంలో విచ్చేశారు. సభ ప్రాంగణం నిండిపోగా సగానికి పైగా జనాలు అరు బయటే ఉన్నారు. రోడ్లన్నీ రద్దీగా మారాయి. సీఎం రేవంత్‌రెడ్డి 40 నిమిషాల పాటు తన ప్రసంగం కొనసాగించారు. పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్ నింపింది. సీఎం ప్రసంగం కొనసాగుతున్నంత సేపు కార్యకర్తల చప్పట్లు, కేరింతలతో మార్మోగింది.

సీఎం సమక్షంలో చేరికలు

జనజాతర బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో తాండూరు మాజీ జడ్పీటీసీ సుద్దాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరుణం పురుషోత్తంరావు,చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అరుణరామేశ్వర్ రెడ్డి, మాజీ చైర్మన్ మాణిక్యరెడ్డి, యువనాయకులు రఘువీర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అప్పా-మన్నెగూడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని వినతి

పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు ఉన్న హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ కోరారు. చేవెళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని సభలో వినతిపత్రాన్ని అందజేశారు. ముడిమ్యాల ఆటవీ ప్రాంతంలో ఐటీ కారిడార్, చేవెళ్ల వరకు మెట్రోరైలు విస్తరించాలని కోరారు. చేవెళ్లలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని, ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును త్వరగా ఏర్పాటు చేయాలని, చేవెళ్ల పార్లమెంటు కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని వినతిలో కోరారు.

భారీ బందోబస్తు

జనజాతర బహిరంగసభకు సీఎం రేవంత్‌రెడ్డి రాకా సందర్భంగా సైబరాబాద్ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. 1,260 మంది అధికారులు, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన బందోబస్తులో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నగరం నుంచి రోడ్డు మార్గం చేవెళ్ల సభకు రావడంతో పోలీసులు దారిపొడవున భద్రత పెంచారు. ముఖ్యంగా అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల వరకు పోలీసులు పహారా చేపట్టారు. సభలో సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పరిషత్ చైర్మన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, వంశీచందర్‌రెడ్డి, మాజీ మ్మెల్సీ యాదవరెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీనివాస్ రావు, జిల్లా డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మల్లు రవి, షబ్బీర్ అలీ, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు పామెన భీంభరత్, నరేందర్ ముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ముధుసూదన్‌రెడ్డి, పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పార్టీ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మాణెయ్య, చంద్రశేఖర్, వెంకటయ్య, జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మందడి చంద్రారెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రెండు నెలలు గడిచినా.. డబ్బులు రాలేదని పత్తి రైతుల నిరసన

పరిగి, ఫిబ్రవరి 27: పత్తిని విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా తమకు ఇంకా డబ్బులు ఖాతాలో జమకాలేదని పత్తి రైతులు నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి మార్కెట్ కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రెండు నెలల కిందట పత్తి పంట విక్రయించారు. అయితే వారం రోజుల్లోనే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న చెప్పిన అధికారులు ఇంత వరకు జమ చేయలేదన్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పత్తి డబ్బులు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాత్రికి రాత్రే మాయం!

- ఘట్‌కేసర్ మున్సిపాలిటీ నర్సరీ బోర్డులు, శిలాఫలకం, మొక్కలు కనుమరుగు
- పట్టించుకోని అధికారులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 27: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నాలుగు సంవత్సరాల కిందట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ రాత్రికి రాత్రే మాయమైంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2020 సెప్టెంబరు 26న 10వ వార్డులో గల సర్వేనెంబర్ 127లోని ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లో గల పార్కు స్థలంలో నర్సరీని ఏర్పాటు చేశారు. మూడున్నర సంవత్సరాలకే నర్సరీ కనుమరుగవడమేంటని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. 9560చదరపు గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నర్సరీ కమాన్ (స్వాగతతోరణం), మంత్రి మల్లారెడ్డి ప్రారంభించిన శిలాఫలకం, అందులోని వేలాది మొక్కలు జాడలేకుండా పోయాయి. గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీ ఉన్నట్టుండి ప్రైవేటు పరమైంది. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన గేటుపై కందకట్ల మాదవరెడ్డిది అని, అతడి ఫోన్‌నెంబర్ రాసి ఉంది. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన నర్సరీ ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఎలా వెళ్లిందని, ఇంత జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నారు. మున్సిపాలిటీ అధికారుల, ప్రజాప్రతినిధుల చేతివాటం లేనిదే నర్సరీ మాయమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నర్సరీ ఏర్పాటుకు రూ.23లక్షల ఎల్‌ఆర్‌ఎస్ నిధులు కేటాయించి అభివృద్ధి చేశారు. దీంతో పాటు మరిన్ని నిధులు కేటాయించి మొక్కలు పెంచారు. ఇప్పుడు అక్కడ ప్రైవేట్ వ్యక్తి పేరుతో బోర్డు వెలవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అది ప్రైవేట్ స్థలం అయితే.. ప్రైవేటు స్థలంలో లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులతో నర్సరీని ఎలా ఏర్పాటు చేశారు? దాదాపు మూడున్నర సంవత్సరాల పాటు స్థల యాజమని ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈవ్యవహారం మొత్తం మున్సిపల్ అధికారి, బీఆర్ఎస్‌కు చెందిన ఓ ముఖ్య నాయకుడి కనుసన్నుల్లోనే జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అడుగడుగునా అక్రమాలు వెలుగుచూస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా కోట్ల రూపాయల విలువ చేసే నర్సరీ మయమవడం పట్ల అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు మున్సిపాలిటీలో అసలేం జరుగుతుందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఘట్‌కేసర్‌లో ఎన్ని కుంభకోణాలు జరిగినా కనీసం చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఘట్‌కేసర్‌లో మాయమైన మున్సిపాలిటీ నర్సరీ కమాన్



గతంలో ఉన్న కమాన్, శిలాఫలకం

నా భూమిలో నర్సరీని ఏర్పాటు చేశారు

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనెంబర్ 127లోని 9560చదరపు గజాల స్థలం నాదే. నా పట్టా భభూమిలో అక్రమంగా నర్సరీని ఏర్పాటు చేశారు. గతంలో పని చేసిన కమిషనర్లతోపాటు ప్రస్తుత కమిషనర్‌కు సైతం ఈ విషయంపై వినతిపత్రాలు అందించాను. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించాను. నాస్థలాన్ని నేను పొందడానికి నానాతంటాలు పడాల్సివస్తోంది. చివరకు మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేసే స్థలాన్ని స్వాధీనం చేసుకున్నా.

- కందకట్ల మాధవరెడ్డి, ఘట్‌కేసర్

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ప్రైమ్‌ల్యాండ్‌లో ఏర్పాటు చేసిన మున్సిపాలిటీకి చెందిన నర్సరీ విషయం ఇంకా నా దృష్టికి రాలేదు. బుధవారం నర్సరీని పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ఎండీ సాబేర్ అలీ కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

కోట్‌పల్లి ప్రాజెక్టును పరిశీలించిన డీఎఫ్‌వో



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు గేట్‌ను పరిశీలిస్తున్న జ్ఞానేశ్వర్

ధారూరు, ఫిబ్రవరి 27: మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాన్ని, ధారూరులోని ఫారెస్టు వన నర్సరీని మంగళవారం జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ సందర్శించారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతంలో కల్పించాల్సిన వసతులు, అభివృద్ధి పనుల పై ఆయన అటవీ అధికారులతో చర్చించారు. అనంతరం ధారూరులోని వన నర్సరీలో మొక్కలను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా పక్కనే అసంపూర్తిగా నిలిచిన ఫారెస్టు రేంజర్ క్వార్టర్‌ను ఆయన తనిఖీ చేశారు. పనులు పూర్తి కాకపోవడం పై ఆయన కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నిర్మాణ పనులను సబ్‌కాంట్రాక్టరు ఇవ్వడంతో ఆగిపోయాయని అటవీ శాఖ అధికారులు డీఎఫ్‌వోకు వివరించారు. డీఎఫ్‌వో వెంట రేంజర్ కృష్ణ, డీఆర్‌వో జగన్, బీట్ అధికారి నరేష్ ఉన్నారు.

చేవెళ్ల సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

వికారాబాద్, ఫిబ్రవరి 27: చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు వికారాబాద్ పట్టణం నుంచి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మందికి పైగా వాహనాల్లో పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కిషన్ నాయక్, సర్ఫరాజ్, రెడ్యానాయక్, మురళి, వేణుగోపాల్‌రెడ్డి, ఆసిఫ్, శ్రీనివాస్ ముదిరాజ్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పరిగి: చేవెళ్లలో జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు పరిగి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా తరలివెళ్లారు. అన్ని మండలాల నుంచి పరిగికి చేరుకున్నారు. పరిగిలోని ఇందిరా గాంధీ విగ్రహానికి మంగళవారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేవెళ్ల సభకు తరలివెళ్లినవారిలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్ధాంతి పార్థసారథి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, డీసీసీ కార్యదర్శులు బి.భీంరెడ్డి, కె.హన్మంత్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్, గండీడ్ మండలాల అధ్యక్షులు బి.పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్ ఆంజనేయులు, అశోక్, జితేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, తావుర్యానాయక్, రాములు నాయక్, అశోక్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం చేవెళ్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, సిరాజుద్దీన్, సురేందర్, గిరిసింగ్, ఏరాజ్‌పాష, చంద్రయ్య, సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభకు పూడూరు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మండలంలోని మన్నెగూడ చౌరస్తా వద్ద మంగళవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జెండా ఊపి బహిరంగసభకు తరలివెళ్లారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ చోరీ

తాండూరురూరల్, ఫిబ్రవరి 27: ట్రాక్టర్ చోరీకి గురైన ఘటన తాండూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. తాండూరుకు చెందిన కామిరెడ్డి నర్సిరెడ్డి అల్లాపూర్‌లోని వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ చేసుకునేందుకు 2006లో మహేంద్ర అర్జున్ ట్రాక్టర్(నెంబర్-ఏపీ28ఎక్స్9250)ను కొనుగోలు చేశాడు. సోమవారం రాత్రి నర్సిరెడ్డి పొలం వద్ద ట్రాక్టర్ పెట్టి ఇంటికి వచ్చాడు. మరుసటిరోజు వెళ్లి చూడగా అక్కడ ట్రాక్టర్ లేదు. దీంతో బాధితుడు కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురిపై కేసు

బషీరాబాద్, ఫిబ్రవరి 27: మండలంలోని మైల్వార్ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద రూ.3,780నగదు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. పేకాడుతూ పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 27: బస్సు ఎక్కుతూ కాలుజారి పడటంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట్ మండలంలో చోటుచేసుకుంది. మొరంగపల్లి బస్టాండ్‌లో కడిచర్ల గ్రామానికి చెందిన వ్యక్తి సాలె వెంకటయ్య మంగళవారం మోమిన్‌పేట్ నుంచి కడిచర్ల గ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో జారి పడిపోయాడు. దీంతో రెండు కాళ్లపై నుంచి బస్సు వెళ్లడంతో రెండు కాళ్లూ విరిగిపోయాయి. అతన్ని వెంటనే 108 వాహనంలో వికారాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 27: మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన పలు అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. అక్రమ కట్టడాలు చేపట్టిన వారికి అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణపు అనుమతుల దస్తావేజులు అధికారులకు సమర్పించక పోవటంతో అధికారులు కొన్ని నిర్మాణాలను తొలగించారు. 6వ వార్డులోని ఓ బహుళ అంతస్తుపై ఏర్పాటు చేసిన పెంట్‌హౌజ్‌తో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్లాబులను అధికారులు తొలగించారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడితే ఉపేక్షించబోమని టౌన్ ప్లానింగ్ అధికారి రాధా కృష్ణ హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం



కొడంగల్: పరీక్షా కేంద్రంలో హాల్ టికెట్ నెంబర్లు వేస్తున్న సిబ్బంది

తాండూరురూరల్, ఫిబ్రవరి 27: తాండూరులో ఇంటర్ పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు తాండూరు ఎగ్జామినేషన్ కస్టోడియన్స్ మల్లినాథప్ప, కృష్ణయ్య పేర్కొన్నారు. నేటి(బుధవారం) నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగనున్నాయని తెలిపారు. తాండూరులో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 2300 మంది విద్యార్థులు, రెండో సంవత్సరంలో 2400 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 650 మంది, రెండో సంవత్సరంలో 700 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి భద్రతను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలను తాండూరు తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తారని తెలిపారు.

కొడంగల్ రూరల్: కొడంగల్‌లో మొదటి సంవత్సరం 638 మంది, ద్వితీయ సంవత్సరం 506మంది, ప్రైవేట్ 59మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి అరగంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పెద్దేముల్: మండల కేంద్రంలో మొత్తం 2750 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఏ.రమేష్ తెలిపారు. వారిలో ఇంటర్ మొదటి సంవత్సరం 1377మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 1314మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 26, రెండవ సంవత్సరం 26మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

మోమిన్‌పేట్: ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్విజిలేటర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 155మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 146మంది విద్యార్థులకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్విజిలేటర్లు వెంకటయ్య, రాములు, కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: కులకచర్లలో ఏర్పాటు చేసిన ఇంటర్మీడియేట్ పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. మంగళవారం ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. బుధవారం నుంచి పరీక్షా కేంద్రాల దగ్గర, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ దుకాణాలు మూసి ఉంచాలని సూచించారు. స్థానిక రామలింగేశ్వర కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

శామీర్‌పేట, ఫిబ్రవరి 27: తల్లిదండ్రులు, పిల్లలు భవిష్యత్తుకు బ్యాంకుల్లో పొదుపు చేసి బంగారు బాటలు వేయాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శామీర్‌పేట గ్రామానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో మమతాబాయి మంగళవారం విచ్చేసి భారత రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ), జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక, అక్షరాస్యత వారోత్సవం-2024 విద్యార్థులతో ర్యాలీని పచ్చజెండా ఊపి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు కలసి బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని శామీర్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పెద్దఎత్తున ర్యాలీని ప్రారంభించాలన్నారు. రాజీవ్‌రహదారిలోని వైఎస్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనిత, ఎంపీటీసీ సాయిబాబు, ఎంఈవో వసంతకుమారి, హైస్కూల్ హెచ్‌ఎం వేణు, పంచాయతీ కార్యదర్శి మౌనిక, స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ సాగర్, అసిస్టెంట్ మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 27: న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న సివిల్, వాహన ప్రమాదాల కేసులు జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యేలా కృషిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ కె.సుదర్శన్ అన్నారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం న్యాయవాదులు, బ్యాంకు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 9వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ పురస్కరించుకుని న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న ప్రమాద బీమా కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యేలా ఇన్సూరెన్స్ కంపెనీ ప్యానెల్ న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సీహెచ్ చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి డీబీ శీతల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కరన్‌కోట్‌లో మల్లికార్జున్ అప్పాజి ముత్యా స్వామీజీకి ఘన స్వాగతం



భక్తులకు దర్శనమిస్తున్న స్వామీజీ

తాండూర్ రూరల్, ఫిబ్రవరి 27: కర్ణాటకలోని యాద్గీర్ జిల్లా షాపూర్ తాలూకా మాల్‌రాజ్ గ్రామానికి చెందిన మల్లికార్జున్ అప్పాజి ముత్యా స్వామీజీ మంగళవారం కరన్‌కోట్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు భక్తులు ఘన స్వాగతం పలికారు. కరన్‌కోట్ గ్రామానికి చెందిన దరిమీది రవిశంకర్, చంద్రకళ దంపతులు స్వామిజీకి ఆశ్రమం నిర్మాణానికి కొంత భూమిని విరాళంగా ఇవ్వడంతో స్వామీజీ మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం రాబోయే రోజుల్లో వృద్ధాశ్రమంతో పాటు యమునరప్ప ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుడుతామన్నారు. తాండూర్ ప్రాంతానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్‌నాయక్ ఆశ్రమం నిర్మాణానికి రూ.లక్ష విరాళం ప్రకటించగా వ్యాపారవేత్త ప్రసరం బస్వరాజ్ రూ.51వేలు, ఉదండపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ కేశవరావు రూ.11వేలు, మాజీ వైస్ ఎంపీపీ శేఖర్ రూ.5116తో పాటు పలువురు భక్తులు విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పూజారి పాండు, కేశవరావు, విఠల్, మోహన్‌రావు, బెల్కటూర్ మాజీ సర్పంచ్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు, చైర్మన్

తాండూరు, ఫిబ్రవరి 27: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు కమిషనర్ స్మిత సబర్వాల్ తాండూరు చెందిన సభ్యులు ఎం.రమేష్ తదితరులు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సుందర్‌రాజన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

సీసీ రోడ్డు పనులు ముమ్మరం

బషీరాబాద్, ఫిబ్రవరి 27: కొత్లాపూర్ పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.గ్రామానికి ఉపాధిహామీ పథకం కింద రూ.5లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నానవత్ భాస్కర్ వెల్లడించారు. ఈరోడ్డు నిర్మాణంతో స్థానిక వార్డుప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతకుముందు తాజా మాజీ సర్పంచ్ రవీందర్ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్‌సింగ్, రాజు, అంజిలయ్య, నగేష్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 27: బస్సులో వదిలేసివెళ్లిన బ్యాగును సదరు ప్రయాణికురాలికి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జి.సంతోషి కుమారి అనే మహిళ మంగళవారం మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన 229 బస్సు ఎక్కి సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ చేరుకుంది. కాగా తనతో పాటు తీసుకొచ్చిన బ్యాగు బస్సులో మర్చిపోయింది. దీంతో సదరు బస్సు కండక్టర్ బి.సక్రి, డ్రైవర్ బి.మహేష్‌లు బ్యాగును డిపో అధికారులకు అందజేశారు. అనంతరం బ్యాగులో చూడగా రూ.లక్ష 80వేల విలువ చేసే మూడు తులాల బంగారు నల్లపూసల దండ, రూ.2వేల నగదు ఉన్నాయి. దీంతో ఆమె కోసం ఆరాతీసి ఎట్టకేలకు ఆమెను పిలిపించి బ్యాగును అప్పగించారు. బ్యాగును భద్రంగా అప్పగించిన బస్సు డ్రైవర్, కండెక్టర్‌లను ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావులు అభినందించారు.

కనీస వేతనాల జీవో వెంటనే అమలు చేయాలి



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మజ్దూర్ సంఘ్ యూనియన్

కీసర, ఫిబ్రవరి 27: ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాల జీవోను సవరించి వెంటనే అమలు చేయాలని మజ్దూర్ సంఘ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయ్ గౌడ్ అన్నారు. కనీస వేతనాల జీవోను సవరించి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాం కల్పించాలని, ఆయుష్మాన్ భారత్ వర్తింప చేయాలని ధనుంజయ్ గౌడ్ అన్నారు. అదే విధంగా 10 సంవత్సరాలుగా అమలు చేయని స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని అమలు చేయాలని, విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్‌లను పర్మినెంట్ చేయాలన్నారు. టీఎస్‌ఆర్‌టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వంతో విలీనం చేసే ప్రక్రియ పూర్తి చేసి, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు అందజేయాలన్నారు. ఈపీఎఫ్ 95 పెన్షన్‌ను వెంటనే 50 వేలు అమలు చేయాలని, అంగన్‌వాడీ, ఆశ, మిడ్‌డే మిల్స్, ఎస్‌హెచ్‌ఎమ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జయేందర్, వెంగళ్రావ్, శ్రీధర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించేలా అధికారులు పనిచేయాలి



మేడ్చల్ కలెక్టరేట్‌లో హరితహారంపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2024 సంవత్సరానికి గానూ హరితహారంలో లక్ష్యాలను అధిగమించేలా పని చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో హరితహారం కార్యాచరణ, ప్రణాళికపై అధికారులతో కలెక్టర్ గౌతమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. లక్ష్యాలకు అనుగుణంగా హరితహారంలో మొక్కలు నాటేందుకు అధికారులు సిద్ధమవ్వాలన్నారు. శాఖల వారీగా ఇచ్చిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో ఖాళీలను గుర్తించి అవసరమైన స్థలంలో మొక్కలు నాటాలన్నారు. హరితనిధిలో ఎన్నిమొక్కలు ఉన్నాయని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో జానకీరామ్, పరిశ్రమశాఖ అధికారి సాంబశివరావు, ఉద్యానవన శాఖ అధికారి నీరజగాంధీ, అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు



ఎక్మాయి శివారులో పట్టుబడిన ట్రాక్టర్, డ్రైవర్‌తో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, ఫిబ్రవరి 27: మండలంలోని వాగుల నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ హెచ్చరించారు. మండలంలోని ఎక్మాయి శివారు వాగులోంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే ఫిర్యాదుతో మంగళవారం తహసీల్దార్ సీరియస్‌గా స్పందించారు. వెంటనే ఆయన డీటీ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం సిబ్బందితో కలిసి ఎక్మాయి శివారులోని వాగు వద్దకు చేరుకున్నారు. అప్పటికే మార్గమధ్యలో ఇసుకను నింపేందుకు వెళ్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. తహసీల్దార్, అధికార సిబ్బంది మోటర్ సైకిళ్లపై మూడు కిలోమీటర్ల దూరంలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దుగా ప్రవహిస్తున్న వాగు వద్దకు వెళ్లి స్వయంగా పరిశీలించారు. వాగులో గత కొంత కాలంగా రాత్రుళ్లు పెద్దఎత్తున ఇసుకను తరలించడాన్ని గుర్తించి వెంటనే విచారణకు ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ మట్లాడుతూ ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తే వాహనాలను సీజ్‌చేసి క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఎక్మాయి శివారులో ఇసుకను తరలించేందుకు వెళ్తూ పట్టుబడిన ట్రాక్టర్‌కు రూ.25వేలకు తగ్గకుండా జరిమానాతో పాటు యజమానిపై పోలీసు కేసు పెడతామని తెలిపారు. అభివృద్ధి పనులకు నవాంద్గీ నదిలోని ఇసుక రిచ్ నుంచి అనుమతిస్తున్నామన్నారు. అయితే కొందరు అనుమతుల పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. మూడు రోజుల కిందట మైల్వార్ శివారులో అక్రమంగా ఇసుక తరలించేందుకు వెళ్లి పట్టుపడిన వాహనాల్లో ఎస్కావేటర్‌కు రూ.6వేలు, 7 ట్రాక్టర్లకు గాను ఒక్కోదానికి రూ.2వేల చొప్పున మొత్తం రూ.30వేలు జరిమానా విధించినట్లు గుర్తుచేశారు.

నాపరాళ్ల అక్రమ తవ్వకాలపై నజర్

బషీరాబాద్, ఫిబ్రవరి 27: అక్రమ నాపరాళ్ల తవ్వకాలు, తరలింపుపై బషీరాబాద్ రెవెన్యూ అధికారులు దృష్టిపెట్టారు. బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ సిబ్బందితో కలిసి మంగళవారం ఎక్మాయి శివారులోని నాపరాళ్ల గనుల్లో ఆకస్మికదాడులు నిర్వహించారు. అక్కడక్కడా కొందరు నాపరాళ్లను తవ్వుతుండటాన్ని తహసీల్దార్ స్వయంగా గుర్తించారు. ప్రభుత్వ భూముల్లో గనుల తవ్వకాలు జరుపుతుండటంపై అనుమతులున్నాయా? మైన్స్ నుంచి లీజులు తీసుకున్నారనే దానిపై అక్కడున్న కొందరిని ఆరా తీశారు. తవ్వకాలకు సంబంధించి అనుమతులుంటే కార్యాలయానికి పత్రాలు తీసుకువచ్చి చూపించాలన్నారు. అక్రమ తవ్వకాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, సిబ్బంది ఉన్నారు.

'అక్రమ మైనింగ్‌పై చర్యలు తప్పవు'

పూడూరు: అక్రమ మైనింగ్‌పై చర్యలు తప్పవని చెన్‌గోముల్ ఎస్‌ఐ మధుసూదనరెడ్డి అన్నారు. అర్ధరాత్రి బాకాపూర్-మిర్జాపూర్ గ్రామ సమీంలో సోమవారం మట్టిని తవ్వుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రెండు టిప్పర్లు, ఒక జేసీబీ ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం మంగళవారం డస్ట్‌తో వస్తున్న టిప్పర్‌ను మైనింగ్ అధికారులు సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్తంగా..

● **బొంరాస్‌పేట్:** విద్యుదాఘాతంతో మృతిచెందిన లక్ష్మణ్, లక్ష్మి కుటుంబానికి వారి బాల్య స్నేహితులు అండగా నిలిచారు. దంపతుల కుమారుడు సిద్ధార్థకు 1993-94 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలిసి మంగళవారం రూ.55వేలు అందజేశారు.

● **దోమ:** మండలంలోని తిమ్మయిపల్లి గ్రామానికి చెందిన చీమె రాములమ్మ తన భూమిని కబ్జాకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్ఐకి వినతిపత్రం అందజేసింది. తన పూర్వీకుల వారసత్వంగా సర్వే నెం.50లో 1.09 ఎకరాలు, సర్వే నెం.43లో 1.20 ఎకరాల భూమి ఉందని అయితే ఇటీవల కాస్తుకు వచ్చి సర్వే నెం.43లో భూమిని విక్రయించావంటూ కబ్జాకు ప్రయత్నిస్తున్నాడంటూ ఆరోపించింది. తమ భూమి విక్రయించగా ఓసర్వే నెంబరు అయితే మరో సర్వే నెంబరులో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

● **మేడ్చల్ టౌన్:** గిరిజనుల సంక్షేమానికి ప్రధాని మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి భట్టు నాగేశ్వరావు అన్నారు. గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

● **తాండూరురూరల్:** ప్రజలు ఏదైనా ఆపద వస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని కరన్‌కోట్ పోలీసులు సూచించారు. తాండూరు మండలంలోని చెంగోల్ గ్రామంలో మంగళవారం సైబర్ క్రైంపై హెడ్‌కానిస్టేబుల్ అమీనుద్దీన్ ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీనెంబర్‌కు ఫోన్‌చేయాలని చెప్పారు.

● **తాండూరురూరల్:** డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మార్చి 4వ తేదీన వికారాబాద్ ఎస్పీ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. తాండూరులో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు, బుగ్గప్ప, కార్యదర్శి వెంకటయ్యలతో కలిసి బుధవారం మార్చి 4న జరిగే చలో ఎస్పీ కార్యాలయం ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు

● **శామీర్‌పేట:** శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం భక్తులు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శామీర్‌పేటకు చెందిన వాసగొని గణేష్-సువర్ణ దంపతులు, గుల్యాగారి బాల్‌గౌడ్-అమృత దంపతులు, దూడల బాల్‌రాజ్‌గౌడ్- మణేమ్మ దంపతులు కూరగాయలు, చిరంజీ చారి కుటుంబసభ్యుల పాల్గొన్నారు.

● **కొడంగల్:** మండలంలోని రావుల్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. కలెక్టర్‌గా లక్ష్మి, డీఈవోగా శ్రీకాంత్, హెచ్‌ఎంగా నందిని, పీఈటీగా అరుణ్ కుమార్, అక్షయ్‌కుమార్, ఆఫీస్ సబార్డినేటర్‌గా విశాల్‌తో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. స్వయం పరిపాలనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

● **దోమ:** పేద విద్యార్థులకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కొండంత అండగానిలుస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి అన్నారు. కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దోమ మండలంలోని పాలెపల్లి ప్రాథమిక పాఠశాలలో పేద విద్యార్థులకు రూ.2500చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలెపల్లి మాజీ సర్పంచ్ యశోద తిరుపతయ్య సాగర్, బీజేపీ మండల కార్యదర్శి నర్సింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** వాల్యానాయక్ తండాలో సంత్ సేవాలాల్, మరియమ్మ జాతర మంగళవారం వైభవంగా జరిగాయి. స్థానిక గిరిజన మహిళలు బోనాలతో గూడి వద్దకు చేరుకుని సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు తండాలో వీధివీధినా భజనలు చేస్తూ శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతాబాయి రామునాయక్, తాజామాజీ సర్పంచ్ శివానాయక్, తాజా మాజీ ఎంపీటీసీ రాజు, తండాపెద్దలు పాల్గొన్నారు.

అంధకారంలో గ్రామాలు

తాండూరురూరల్, ఫిబ్రవరి 27: కోటబాస్పల్లి గ్రామశివారులోని సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలన్నీ చీకటిమయంగా మారాయి. ఈ విషయంపై ఆయా గ్రామాలనుంచి విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్లు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌సరఫరా సాయంత్రం 4గంటల నుంచి ఆయా గ్రామాలకు సరఫరా చేసే విద్యుత్ నిలిచిపోవడంతో మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, కోటబాస్పల్లితోపాటు రాంపూర్, సిరిగిరిపేట్, రాంపూర్‌మీదితండా, కిందితండా, వీరారెడ్డిపల్లి తదితర గ్రామాలన్నీ సాయంత్రం 4గంటల నుంచి చీకటిమయంగా మారాయని ప్రజలు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గుంతబాస్పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఖైరత్‌అలీ సమాచారం తెలుసుకునేందుకు విద్యుత్‌శాఖ లైన్‌మన్ పద్మారెడ్డికి పలుమార్లు ఫోన్‌చేసినా స్పందించలేదని ఆయన విద్యుత్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేతపై విద్యుత్ శాఖ ఏఈ నిఫోన్‌లో వివరణ కోరగా తాండూరు మండలం అంతారం గ్రామశివారులో సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే మెయిన్‌లైన్‌పై తడిబట్టలు పడటం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. అయితే త్వరలోనే పునరుద్ధరించేలా చర్యలు చేపడతామని ఏఈ తెలిపారు. సమస్యపై స్పందించని లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

కొత్త విషయాలను నేర్చుకోవాలి: ఎస్పీ


వికారాబాద్, ఫిబ్రవరి 28: ఏఆర్, ఎస్‌సీటీపీసీలు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో మంగళవారం ఏఆర్, ఎస్‌సీటీపీసీ తొమ్మిది నెలల శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 బ్యాచ్‌కు చెందిన ఆసిఫాబాద్ నుంచి 55, రామగుండం నుంచి 109, సిద్దిపేట నుంచి 60 మొత్తం 224 మంది ట్రెయినీ పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణకు వచ్చినట్లు తెలిపారు. పోలీస్ నోటిఫికేషన్ వెలువడిన అనంతరం పోలీస్ ఉద్యోగ ఉత్తీర్ణత సాధించడానికి లక్షల మంది నిరుద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి ఈవెంట్స్ ప్రాక్టీస్ చేస్తారన్నారు. అందులో కొందరికే ప్రజాసేవ చేసే అవకాశం వస్తుందన్నారు. తెలంగాణ పోలీసులకు బెస్ట్‌పోలీస్‌గా దేశంలోనే సముచిత స్థానం ఉందన్నారు. ప్రస్తుతం ట్రెయినింగ్‌లో ఉన్న ఎస్‌సీటీపీసీలు ఖ్యాతిని ఉన్నతంగా నిలబెట్టాలని సూచించారు. స్వీయ క్రమశిక్షణను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, వికారాబాద్‌డీఎస్పీ అంజయ్య, తాండూరు డీఎస్పీ బాలకృష్ణ, డీటీసీ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్‌ఐలు, ఎర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి'

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 27: ఉపాధిహామీ నిధులతో వివిధ గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట గ్రామంలో పర్యటించి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. జిల్లాలో మంజూరైన సీసీ రోడ్ల పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేసేందుకు వేగవంతంగా పనులు చేపట్టాలన్నారు. ఆయా గ్రామాలకు మంజూరైన పనులను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. మెట్లకుంట గ్రామానికి ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శ్రీరాములు, డీఈ సుదర్శన్‌రావు, ఏఈ సురేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ నారాయణ, కార్యదర్శి సిద్దు ఉన్నారు.

భూ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండదు

● పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



పరిగి, ఫిబ్రవరి 27: భూ వివాదాలు, సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి స్పష్టం చేశారు. పరిగిలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దోమ మండలంలోని తిమ్మాయిపల్లిలో సర్వేనంబర్ 50లో 1-09 ఎకరాల భూమి విషయంలో తాను జోక్యం చేసుకున్నానని వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు. భూముల వివాదాలు సివిల్ సమస్య కిందకు వస్తుందని తెలిపారు. భూముల పొజిషన్ రెవెన్యూకు సంబంధించిన విషయమన్నారు. ఒకవేళ కోర్టు, రెవెన్యూశాఖల నుంచి భద్రత గురించి కోరితే మాత్రం తమ ప్రమేయం ఉంటుందన్నారు. పోలీసులకు డబ్బులు ఇచ్చామని చెబుతున్న విషయంపై విచారణ జరిపిస్తామని, డబ్బులు తీసుకున్నట్లయితే సంబంధించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

దోమ, ఫిబ్రవరి 27: చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని బాసుపల్లి గ్రామ ప్రధాన రోడ్డులో మంగళవారం ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా, అనుమానితులుగా కనపించినా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో మూఢనమ్మకాలను ప్రజలు నమ్మరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహులు, మైపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.